కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట-20, పచ్చిమిర్చి-50, బెండకాయ-40, కాకరకాయ-60, దొండకాయ-40, దోస-40, ఆలు-30, చామ60, కీర-40 , బీర 60, వంకాయ-40, గోకరకాయ-60, బీన్స్-120, బీట్‌రూట్-40, క్యాప్సికమ్-60, క్యాబేజీ-20, క్యారెట్ 40, చిక్కుడు-90, ఉల్లి-25(కేజీ) ములక్కాయలు(2)-10, కాలీఫ్లవర్-(1)-30.

మెడికవర్ ఆస్పత్రి- టీటీపీఓఏ ఎంఓయూ

మాదాపూర్: మెడికవర్ హాస్పిటల్స్, తెలంగాణ ట్రెనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీటీపీఓఏ) సంయుక్తంగా హెల్త్ కనెక్ట్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంఓయూ కుదుర్చుకున్న సందర్భంగా సభ్యులకు వారి కుటుంబ సభ్యులకు మెడికవర్ ఆస్పత్రి వైద్య సదుపాయాలను, డిస్కౌంట్‌లను అందించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మెడికవర్ సెంటర్‌హెడ్ శ్రీకాంత్, మెడికవర్ మల్టీస్పెషాలిటీ సెంటర్ హెడ్ శుభాంకర్, మెడికవర్ ఉమెన్, చైల్డ్ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్ బననా , కార్పొరేట్ రిలేషన్స్ ఏజీఎం శైలజ కోట, టీటీపీఓఏ సభ్యులు పాల్గొన్నారు.

గణేష్‌గడ్డ కిటకిట



పటాన్‌చెరు టౌన్: గణేష్‌గడ్డ దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం అమావాస్య నేపథ్యంలో నిర్వహించిన పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సంతోష్ జోషి, చంద్రశేఖర్‌స్వామి, జగదీష్ స్వామి మాట్లాడుతూ... అమావాస్య సందర్భంగా స్వామివారికి ఉదయం పంచామృత అభిషేకం ,హోమం, పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం .... సోమవారం నిర్వహించిన డ్రైవ్‌లో 8 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఏడుగురికి రూ. వెయ్యి చొప్పున, ఒక్కరికి రూ.1500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి మండలపరిధిలోని వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ కూకట్‌పల్లి పార్టు, డివిజన్‌ల పరిధిలోని పలువురికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ 10,01,160 రూపాయల చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు నాయినేని చంద్రకాంత్‌రావు, హరినాథ్, నాగేశ్వరరావు, అష్రాఫ్, శ్రీకాంత్, యాసిన్ పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన



ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని వెస్టర్న్‌హిల్స్ సొసైటీ, అడ్డగుట్ట కాలనీలో జీహెచ్‌యంసీ ఆధ్వర్యంలో నాలా పూడికతీత పనులను మంగళవారం హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు . ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తి చేయాలని తెలిపారు. జీహెచ్‌యంసీ ఏఈ రాజీవ్, వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్‌లోని రాంనరేష్ నగర్‌లో 35 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా చేపట్టబోయే భూగర్భ డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మంగళవారం స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ సమస్య పరిష్కారం దిశగా పనులు చేపడుతున్నామన్నారు. అత్యవసరం ఉన్న చోట, నిత్యం మురుగు పొంగుతున్న ప్రాంతాలను ప్రథమ ప్రాధాన్యతగా గుర్తించి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. రాంనరేష్ నగర్ కాలనీలో ఏళ్లనాటి సమస్య తీరనున్నదన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు డీజీఎం నాగప్రియ, మేనేజర్ ప్రియాంక, నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

రాయదుర్గం: జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలోని జర్నలిస్ట్ కాలనీలో విద్యార్థులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. మంగళవారం జవహర్ బాలమంచ్ ఆధ్వర్యంలో రంగారెడ్డిజిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి అభిషేక్‌గౌడ్ ఆధ్వర్యంలో సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో కూడా విద్యార్థులను ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు శశాంక్‌రావు, సంఘమేష్, దేవేందర్‌రెడ్డి, సందీప్ ముదిరాజ్, కిరణ్, అమాన్, సుభానీ, నవీన్, ఎజాజ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు కిందపడి వ్యక్తి మృతి



గచ్చిబౌలి: ఆర్టీసీ బస్సు కింద పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బర్కత్‌పుర డిపోకు చెందిన రూట్ నెంబర్ 217సి బస్సు సీబీఎస్ నుంచి పటాన్‌చెరుకు వెళుతుంది. సోమవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో రాయదుర్గం వైపు నుంచి బయోడైవర్సిటీ బస్టాప్ వద్దకు వస్తుండగా పరుగున వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి(35- 40)ఎడమ వైపు బస్సు వెనక చక్రాల కింద పడ్డాడు. డ్రైవర్ బ్రేక్ వేసినప్పటికీ తలపైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సీసీ కెమెరాలు పరిశీలించగా బస్సు ఆగుతుండగానే పరిగెత్తుకుంటూ వచ్చి టైరు కింద పడ్డట్లుగా ఉందని పోలీసులు తెలిపారు. కొంత కాలంగా ఐటీ కారిడార్‌లోనే తిరుగుతున్నట్లు గుర్తించామని పోలీసులు పేర్కొన్నారు. మృతుని ఆచూకీ తెలియలేదన్నారు. ఆర్టీసీ బస్సు కండక్టర్ యాదవరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఎఫ్‌డీడీఐలో 'ప్రతిభ సమ్మాన్ సమారోహ్'

రాయదుర్గం: ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్-హైదరాబాద్ క్యాంపస్‌లో బుధవారం 'ప్రతిభ సమ్మాన్ సమారోహ్' కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 12వ తరగతి టాపర్లను సత్కరించాలని నిర్ణయించారు. విద్యా రంగంలో ప్రతిభను గుర్తించడం, యువ విజేతలను ప్రోత్సహించడానికే ఎఫ్‌డీడీఐ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. రాష్ట్రం లేదా కేంద్ర విద్యా బోర్డు నుంచి 60 శాతం మార్కులు లేదా 6.0 సీజీపీఏతో 12వ తరగతి పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థుల కోసం రూపొందించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 7869398146,9505555133లలో సంప్రదించాలని అధికారులు తెలిపారు.

క్విజ్ పోటీలు.. బహుమతులు ప్రదానం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

చందానగర్: చందానగర్ పీజేఆర్ స్టేడియంలో మంగళవారం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. యువత ప్రస్తుత విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక నాయకులు రఘునాథ్‌రెడ్డి, విద్యావేత్తలు పాల్గొన్నారు.

సీఆర్ ఫౌండేషన్‌లో ఫ్యామిలీ డాక్టర్ల దినోత్సవం

చందానగర్: కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వర రావు ఫౌండేషన్‌లో ప్రపంచ ఫ్యామిలీ డాక్టర్ల దినోత్సవంను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఫ్యామిలీ డాక్టర్స్ చాప్టర్ క్లాసెస్ టీఎస్ ఏఎఫ్‌పిఐ, సీఆర్ పాలీక్లినిక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్లినిక్‌లోని డాక్టర్లకు సీపీడీ తరగతులు నిర్వహించారు.అనంతరం సీఆర్ పాలీక్లినిక్ అడ్వైజర్ డాక్టర్ బి రంగారెడ్డి సందేశం అందించారు. అనంతరం వైద్యులను, వక్తలను సన్మానించారు. కార్యక్రమంలో మహిళలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు విభిన్న కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ



చందానగర్: చందానగర్ హుడాకాలనీలోని లైట్ హౌజ్‌లో మంగళవారం ట్రాన్స్‌జెండర్ల నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం చందానగర్ సర్కిల్ 21 ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ సమాజానికి ప్రత్యేకంగా మొదటి స్కిల్లింగ్ బ్యాచ్‌ను ప్రారంభించామన్నారు. కంప్యూటర్లు, టైలరింగ్, బ్యూటీషియన్, ఎంఎస్ ఆఫీస్ వంటి విభిన్న కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారన్నారు. కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన తరువాత ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో యూసీడీ ప్రాజెక్టు అధికారి విజయలక్ష్మి, లైట్ హౌజ్ మేనేజర్ ఆకుల శ్రీనివాస్, ట్రాన్స్‌జెండర్ కోఆర్డినేటర్ ముకుందమాల పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రానికి తప్పిపోయిన బాలిక



జ్యోతిక

మియాపూర్: తప్పిపోయిన తిరుగుతున్న బాలికను మియాపూర్ పోలీసులు చేరదీసి బాలల సంరక్షణ కేంద్రంలో చేర్పించారు. ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మియాపూర్ గోపాల్‌రావునగర్ కాలనీలో మంగళవారం బాలిక (8 సంవత్సరాలు) తిరుగుతుంది. పోలీసులు గమనించి ఆమె పేరు, చిరునామా అడుగగా పేరు జ్యోతిక అని, తల్లిదండ్రుల పేర్లు అఖిల, నవీన్ అని చెప్పింది. అడ్రస్ తెలియకపోవడంతో పోలీసులు బాలిక ను చందానగర్‌లోని బాల ల సంరక్షణ కేంద్రంలో చేర్పించారు. బాలిక జ్యోతికను గుర్తించినట్లయితే మియాపూర్ పోలీసులకు ఫోన్ నంబర్ 8712568116కు సమాచారం అందించాలని తెలిపారు.

శబ్ద కాలుష్యంపై ఫిర్యాదు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ వీధుల్లో నిత్యం పెద్ద ఎత్తున వస్తున్న శబ్ద కాలుష్యాన్ని నియంత్రించాలని స్థానిక నాయకులు గుండ్ల మహేందర్ రెడ్డి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీధుల్లో పెద్ద ఎత్తున యువకులు ద్విచక్ర వాహనాలపై రాత్రింబవళ్లు శబ్దాలు చేస్తున్నారని వాపోయారు. శబ్దాలకు కారణమవుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నాణ్యత పాటించాలి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉజ్జయిని మహంకాళినగర్‌లో 15 లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, ఏఈ శ్రావణితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పోశెట్టి గౌడ్, రాము, వెంకట్, రఘురాంరెడ్డి, అంజయ్య యాదవ్,చంద్రశేఖర్, పరశురాములు, ఆంజనేయులు, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

శిశువు మృతదేహం లభ్యం

గచ్చిబౌలి: కొండాపూర్ జిల్లా ఆస్పత్రి ఆవరణలో మగ శిశువు మృతదేహం లభ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆస్పత్రి ఆవరణలో ఓ మూలన మగ శిశువు మృతదేహం పడి ఉందని సోమవారం అర్ధరాత్రి డయల్ 100కు కాల్ చేశారు. గచ్చిబౌలి పోలీసులు శిశువు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మూడు రోజుల క్రితం జన్మించిన శిశువు మరణించగా డాక్టర్లు కుటుంబ సభ్యులకు అప్పగించారని తెలిసింది. ఆ శిశువేనా లేక వేరే ఎవరైనా వదిలి వెళ్లారా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ఇటీవల డెలివరీ అయిన కేసుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఆస్పత్రి బయట ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నారు.